క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఔదార్యం



ప్రతాప్ కుటుంబ సభ్యులకు డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థులు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం హిమాంపురం గ్రామానికి చెందిన కురువ ప్రతాప్ 15 ఏళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని యాదవ విద్యార్థి వసతి గృహంలో ఉంటూ ఎస్టీబీసీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం ప్రైవేట్ ఉద్యోగం చేసు కుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడు ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కర్నూలు యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థి వార్డెన్ రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.86 వేలు సేకరించి ప్రతాప్ కూతురు సాయి వర్షిణి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ బాండును గురువారం ప్రతాప్ భార్య సాయమ్మకు అందేజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లింగందిన్నె నాగరాజు, కొర్విపాడు నారాయణ, ఈదన్న, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం



పూజలు చేసి కంప్యూటర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏకాంబర రెడ్డి

కర్నూలు కల్చరల్: నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మహాదాత జి.పుల్లారెడ్డి కుమారుడు ఏకాంబర రెడ్డి, మూడు ప్రాంతాల క్షేత్ర సంఘటనా మంత్రి గుమ్మళ్ల సత్యం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ ఏకాంబర రెడ్డి సౌజన్యంతో వారి మాతృమూర్తి జి.నారాయణమ్మ పేరుతో కంప్యూటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్, రాష్ట్ర కోశాధికారి సండడి మహేష్, రాష్ట్ర సహ కోశాధికారి గూడా సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి శ్రీరామ కథా రసవాహిని

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు శ్రీరామ కథా రస వాహిని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సమితి జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీరామ కథా రస వాహిని పేరుతో శ్రీమద్ రామాయణంలోని ముఖ్యమైన పాత్రలపై మూడో రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. చిన్మయ మిషన్ ప్రవచకులు స్వామిని సుప్రేమానంద సరస్వతి ప్రవచనం చెబుతారని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.





జొహరాపురం మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



కొత్త ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి



జొహరాపురం నమాజుకు తరలివస్తున్న ముస్లింలు





కొత్త ఈద్గాలో రంజాన్ పండుగ సందర్భంగా ప్రార్థన చేయిస్తున్న మతపెద్ద ముక్తి సయ్యద్ మన్సూర్ అహ్మద్, హాజరైన ముస్లింలు



దువా చేస్తున్న ముస్లింలు



కొత్త ఈద్గాలో ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం

- రంజాన్ ముగింపు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు
- కిక్కిరిసిన ఈద్గాలు, మసీదులు

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

కర్నూలు (న్యూటౌన్): పవిత్ర రంజాన్ మాస ముగింపు పండుగ ఈదుల్ ఫితర్‌ను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. గురువారం ఉదయం 6 నుంచే శుద్ధి స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి ఈద్గాలకు చేరుకున్నారు. ఈద్గాలకు వెళ్లలేని వారు మసీదులకు వెళ్లి ఈద్ నమాజు చదువుకున్నారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించిన ఖాజీలు, మౌల్వీల ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేశారు. ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ కరచాలనం, ఆలింగనం చేసుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం పండుగ రావడంతో శుభాలు జరగాలని కోరుకున్నారు. ఆధ్యాత్మికంగా జరిగిన నమాజులో పాల్గొనేందుకు తరలివచ్చిన ముస్లింలతో ఈద్గాలు, మసీదులు కిక్కిరిసిపోయాయి. కొన్ని చోట్ల స్థలం లేకపోవడంతో రోడ్లపైనే నమాజు చేసుకున్నారు. పాత ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీంబాషా సాహెబ్, కొత్త ఈద్గాలో ముఫ్తీ సయ్యద్ మన్సూర్, గడ్డా వీధిలోని అహిలే హదీస్ ఈద్గాహ్‌లో హాఫీజ్ మంజూర్ అహ్మద్, జొహరాపురం ఈద్గాహ్‌లో హాఫీజ్ ఫరూఖ్ ఉమ్రి మదాని, ఈద్గాలకు వెళ్ళలేని పెద్దలకు ప్రత్యేకంగా నిర్మల్‌నగర్ ఆయేషా మసీదులో హాఫిజ్ అబ్దుల్లాహ్ రషాదీ నమాజ్ చేయించారు. జొహరాపురం ఈద్గా ప్రార్థనల్లో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, సంతోష్‌నగర్ ఈద్గా ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



పాత ఈద్గాలో రంజాన్ పండుగ సందర్భంగా ప్రార్థన చేయిస్తున్న మతపెద్ద సయ్యద్ సలీం బాషా సాహెబ్, హాజరైన ముస్లింలు





గడ్డా వీధిలో ప్రార్థనలు చేస్తున్న మతపెద్ద హాఫీజ్ మంజూర్ అహ్మద్



జొహరాపురంలో ప్రార్థన చేస్తున్న మతపెద్ద హాఫీజ్ ఫరూఖ్ ఉమ్రి మదాని

యువతే వైఎస్సార్‌సీపీకి అండ



మాట్లాడుతున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

- కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు (టౌన్): యువతే వైఎస్సార్ సీపీకి అండ అని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. గురువారం నరసింగరావు పేటలోని పార్టీ కార్యాలయంలో 42, 44, 45 వార్డులకు చెందిన పలువురు యువకులు వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించారు. పాటిల్ తిరుమల్ రెడ్డి సమక్షంలో వీరంతా ఇంతియాజ్ కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో మరోసారి కర్నూలు నగరంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని యువతకు సూచించారు.

పరామర్శ

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు పంచాయతీ అంబేడ్కర్ నగర్‌కి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతాప్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో మృతి చెందాడు. కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్య ర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ గురువారం ఆ గ్రామానికి వెళ్లి ప్రతాప్ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు.

కబడ్డీ విజేత విజయవాడ



విజయవాడ జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన శ్రీవల్లెలాంబదేవి తిరునాల ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఓపెన్‌టూ ఆల్ కబడ్డీ పోటీల్లో విజయవాడ జట్టు విజేతగా నిలిచింది. మూడురోజుల పాటు జరిగిన పోటీల్లో 28 జట్లు తలపడ్డాయి. బుధవారం రాత్రి హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో ప్యాపిలి జట్టుపై విజయవాడ జట్టు ఐదు పాయింట్లతో గెలుపొందింది. విజయవాడ జట్టుకు రూ.40వేలు, ప్యాపిలి జట్టుకు రూ.30 వేలను దాతల సహకారంతో కమిటీ సభ్యులు అందజేశారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన గుంటూరు, అయ్యకొండ జట్లకు రూ.20 వేలు, రూ.10వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు, మల్లారెడ్డి, రవి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 34వ వార్డులో ఆయన ఇంటింటి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పరిపాలన తెచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. టీడీపీ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు అంతో ఇంతో సమర్పించుకోవాల్సి వచ్చేదన్నారు. తమ ప్రభుత్వంలో ఎలాంటి లంచాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. మరోసారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడు ధర్మ స్వరూపుడు

కర్నూలు కల్చరల్: శ్రీరాముడు ధర్మ స్వరూపుడని విశ్రాంత తెలుగు పండితులు గరుడాద్రి వనజ కుమారి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు 'శ్రీరాముడు – ధర్మ స్వరూపుడు' అంశంపై ఉపన్యసించారు. ధర్మబద్ధమైన జీవితం ఉత్తమమైందన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నగరూరి దీప్తి, కార్పొరేటర్ నగరూరి శ్రీనివాసులు, అర్చకులు గిరిశర్మ, కృష్ణకాంత్, మహాలక్ష్మి పాల్గొన్నారు.



ప్రవచనం చెబుతున్న ధార్మిక ఉపన్యాసకులు గరుడాద్రి వనజకుమారి

బలహీన వర్గాల ఆరాధ్య దైవం పూలే

కర్నూలు అర్బన్/సిటీ/సెంట్రల్/టౌన్: బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకుని గురువారం ఆయన విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిర్లా కాంపౌండ్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ భవన్ ఎదురుగా ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు సిట్రా సత్యనారాయణమ్మ, సీనియర్ బీసీ నాయకులు గడ్డం రామకృష్ణ, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మికాంతయ్య తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బీవై రామయ్య తన కార్యాలయంలోనూ పూలే జయంతి వేడుకలు నిర్వహించుకున్నారు.

☛ నరసింగరావుపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ శ్రీరాములు, పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, సత్యం యాదవ్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

☛ జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

☛ ఎల్కూరు బంగ్లాలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఆ పార్టీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

☛ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి జి.రాంపుల్లయ్య యాదవ్, కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి మురళీకృష్ణ, తదితరులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

☛ వీరనారి ఐలమ్మ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గురుశేఖర్ పూలేమాల వేసి నివాళులర్పించారు.

☛ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక కార్యాలయంలో పూలే చిత్ర పటానికి వేదిక వ్యవస్థాపకురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, బీసీ జనసభ రాష్ట్ర నాయకులు టీ శేషఫణి, ఇంటలెక్చువల్ ఆర్గనైజేషన్ నాయకులు ఖదీరుల్లా తదితరులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం బీ క్యాంప్‌లోని మన వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం అందించారు.

☛ బుధవారపేటలోని పూలే, అంబేడ్కర్ కార్యాలయంలో సీపీఎం కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పార్టీ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిట్రా సత్యనారాయణమ్మ, బీవై రామయ్య



పార్టీ నగర కార్యాలయంలో పూలే జయంతి వేడుకల్లో కర్నూలు అభ్యర్థి ఇంతియాజ్



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, నేతలు



వృద్ధులకు అల్పాహారం అందిస్తున్న బీసీ సంఘం నేతలు



జెడ్పీలో పూలే చిత్ర పటం వద్ద నివాళుర్పిస్తున్న సీఈఓ జి. నాసరరెడ్డి, ఉద్యోగులు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

దేశ రక్షణకు కంకణ బద్ధులు కావాలి

కర్నూలు కల్చరల్: దేశ రక్షణ, ధర్మం కోసం కంకణ బద్దులు కావాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం అన్నారు. గురువారం వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీహెచ్‌పీ అనుబంధ సంస్థల కార్యకర్తలకు వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. దేశం కోసం పనిచేసేలా దిశానిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ రాబోయే హనుమజ్జయంతి, విశ్వహిందూ పరిషత్ షష్టి పూర్తి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. జన సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా నూతనంగా పరిచయమైన హిందూ బంధువులను సామాజిక, ధార్మిక సంస్థల్లోని వివిధ విభాగాల్లో నూతన బాధ్యతలను ఇవ్వాలని సూచించారు. వీర హనుమాన్ విజయ శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సండడి మహేష, కార్యదర్శిభాను ప్రకాష్, నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి, రాష్ట్ర సహ సేవ ప్రముఖ్ గురుమూర్తి, భజరంగ్‌దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మాతృశక్తి సంయోజక పావని, దుర్గవాణి సంయోజక సింధూర శ్రీవాణి పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

మాతృమరణాల తగ్గింపే లక్ష్యం

కర్నూలు(హాస్పిటల్): మాతృమరణాల తగ్గింపే తమ లక్ష్యమని సేఫ్ మదర్‌హుడ్ కమిటీ సభ్యులు, కర్నూలు ఫెడరేషన్ ఆఫ్ గైనిక్ సొసైటీ(ఫాగ్సి) అధ్యక్షులు డాక్టర్ ఎస్.వెంకటరమణ చెప్పారు. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెద్దాస్పత్రిలోని ప్రసూతి విభాగంలో గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. వెంకటరమణ మాట్లాడుతూ మాతృమరణాలను తగ్గించేందుకు వైట్ రిబ్బన్ అలయెన్స్ కమిటీ 1991లో ఏర్పాటైందన్నారు. బెటర్ మెటర్నల్ హెల్త్ కేర్ ద్వారా ఏటా సురక్షిత మాతృత్వ దినం నిర్వహించడమే దీని లక్ష్యమన్నారు. గర్భిణులకు యాంటీనేటల్ చెకప్స్, అత్యవసర సమయాల్లో అందించాల్సిన వైద్యం, కాన్పు సమయంలో బాలింతలకు, ఆ తర్వాత బిడ్డకు, ఆరు వారాల పాటు బాలింతల కేర్ గురించి వైద్యులతో పాటు సిబ్బంది, గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. గైనిక్ సొసైటీ ద్వారా సేఫ్ మదర్‌హుడ్ కమిటీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ పూనమ్ వ్యవహరిస్తున్నారని, సభ్యునిగా తాను ఉన్నట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా మాతృత్వ మరణాలు తగ్గించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫాగ్సీ ట్రెజరర్ డాక్టర్ మమత, డాక్టర్ వెంకటనారాయణ, డాక్టర్ కుముద, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ స్నేహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్. వెంకటరమణ